క్లుప్తంగా

క్షీరాభిషేకం



సంగెం : దివ్యాంగులకు నెలకు పింఛన్ రూ.4016 ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేస్తు మండలంలోని పల్లారుగూడలో దివ్యాంగులు ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. గురువారం పల్లారుగూడ, వీఆర్ఎస్ తండా, పోచమ్మతండాలకు చెందిన దివ్యాంగులు పల్లారుగూడ గ్రామపంచాయతీ వద్ద సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం స్వీట్లు పంపిణీ చేసుకుని సంబరాలు చేసుకున్నారు. సర్పంచ్‌లు కక్కెర్ల కుమారస్వామి, గుగులోత్ బిచ్చానాయక్, రమరవీందర్, ఎంపీటీసీ గుగులోత్ వీరమ్మ, ఉప సర్పంచ్ కోడూరి రఘు, పంచాయతీ కార్యదర్శులు అజయ్, రమేష్, నాయకులు రాజమౌళి, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

నియామకం

దుగ్గొండి : మండలంలోని పొనకల్ గ్రామానికి చెందిన కోతి మమత జిల్లా మహిళా కాంగ్రెస్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ గురువారం ఉత్తర్వులు వెలువరించారు. ఈ సందర్భంగా మమత మాట్లాడారు. తనకు పదవి రావడానికి సహకరించిన ఏఐసీసీ సభ్యుడు దొంతి మాధవరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నర్సంపేట ఎమ్మెల్యేగా మాధవరెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని ఆమె అన్నారు.

మండల కమిటీ ఎన్నిక



దుగ్గొండి : బీఆర్ఎస్ మండల నూతన కార్యవర్గాన్ని జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్ గురువారం గిర్నిబావిలో ప్రకటించారు. మండల అధ్యక్షుడుగా సుకినె రాజేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా మేర్గు రాంబాబు, ఉపాధ్యక్షులుగా బూర చందు, కామిశెట్టి ప్రశాంత్, మట్ట రాజు, భూంపెల్లి రజినీకర్‌రెడ్డి, తోటకూరి రాజు, లాండె రమేష్, సంయుక్త కార్యదర్శిగా పల్లె రమేష్, నల్లబెల్లి శోభన్, ఎర్ర ఆదిరెడ్డి, సింగతి రాజన్న, కోశాధికారిగా సోలంకి లింగయ్య, ప్రచార కార్యదర్శులుగా నర్ర రమణారెడ్డి, పెండ్లి రవి, రాయరాకుల బాబురావు, కొంరారెడ్డి, లింగాల రమేష్, గుండెకారి రవికుమార్ ఎన్నికకాగా 10 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో తోకల నర్సింహారెడ్డి, కాట్ల భద్రయ్య, శానబోయిన రాజకుమార్,కమలాకర్ పాల్గొన్నారు.

మానవ హక్కుల మండల కమిటీ..



దుగ్గొండి : జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) నూతన కార్యవర్గాన్ని మండల కేంద్రంలో గురువారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కోమాండ్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా గడ్డమీది శ్రీను, ఉపాధ్యక్షుడిగా మాదారపు ప్రదీప్, ప్రచార కార్యదర్శిగా మొద్దు వీరన్న, సంయుక్త కార్యదర్శిగా కొమ్ముల దిలీప్, అధికార ప్రతినిధిగా కక్కెర్ల రాజు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఈసీ మెంబర్ గోరపూడి భాస్కర్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బాలినే లక్ష్మీ, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగెం రమేష్, మురళీమోహన్ పాల్గొన్నారు.

'మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌పై కుట్రలు సహించం'



గీసుకొండ : మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌పై కుట్రలను సహించబోమని గౌడ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గట్టు నరేశ్‌గౌడ్ అన్నారు. గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారంలో గురువారం జరిగిన కల్లుగీత కార్మిక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌పై హత్యకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. విలాసాగరం రాజు, తాళ్ళపెల్లి నర్సయ్య, మచ్చిక ప్రవీణ్, ప్రణీత్, నోముల నర్సయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

సర్పంచ్‌పై చర్య తీసుకోవాలి

వర్ధన్నపేట : గ్రామ పంచాయతీ ట్రాక్టర్, సిబ్బందిని తమ సొంత పనులకు సర్పంచ్ వాడుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జక్కి శ్రీకాంత్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని నల్లబెల్లి గ్రామంలో పంచాయతీ భవన నిర్మాణానికి గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ను సిబ్బందిని వినియోగించుకుంటున్నారని, గతంలో సైతం ఈ విధంగానే తమ సొంత పనులకు వినియోగించారని జక్కి శ్రీకాంత్ ప్రశ్నించారు. గ్రామ పంచాయతీ భవన నిర్మాణాన్ని కాంట్రాక్ట్ తీసుకుని పంచాయతీ సిబ్బందిని, ట్రాక్టర్‌ను వాడుకోవడం అక్రమమన్నారు. ఈ విషయంపై అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శ్రీకాంత్‌తో పాటు తాటికాయల దిలీప్, చంద్రయ్య పాల్గొన్నారు.

వర్ధన్నపేటలో విద్యుత్ కోతలు

- రెండు నెలలుగా మరమ్మతుల పేరుతో కరెంట్ కట్
- ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు
- ఇళ్లపై నుంచే తీగలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



విద్యుత్ లైన్ పునరుద్ధరిస్తున్న కార్మికులు



ఇళ్ల సమీపం నుంచి వెళ్తున్న విద్యుత్ లైన్

వర్ధన్నపేట : అభివృద్ధి పేరిట తరుచూ విద్యుత్ కోతలు విధిస్తున్నారు. రెండు నెలలుగా వర్ధన్నపేటలో రోడ్డు వెడల్పుతో విద్యుత్ స్తంభాలు తొలగించి కొత్త విద్యుత్ స్తంభాలు వేయాలి. వాటికి విద్యుత్ తీగలను సరిచేయాల్సి ఉంటుంది. కానీ అధికారుల నిర్లక్ష్యం.. కాంట్రాక్టర్ పట్టింపులేని తనంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి..

రెండు నెలలుగా తాత్సారం

వర్ధన్నపేటలో జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్త లైన్లు, స్తంభాలు వేయడంలో రెండు నెలలుగా విద్యుత్ అధికారులు తాత్సారం చేస్తున్నారు. ఇప్పటికే మరమ్మతుల పేరుతో రెండు నెలల్లో సుమారు 10 నుంచి 12 రోజులు విద్యుత్ సరఫరా నిలిపి వేసి పనులు చేపడుతున్నారు. అయినా ఆ పనులు ఇంకా పూర్తి కాలేదు. ముందస్తు సమాచారం లేకుండా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉండడంతో పట్టణ వాసులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడంతో పట్టణ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై ఎవరైనా ప్రశ్నిస్తే పట్టణ అభివృద్ధికే కదా అంటూ అధికారులు దాటవేస్తున్నారు. కేవలం 120 విద్యుత్ స్తంభాలు నాటి హెచ్‌టీ లైన్, సాధారణ లైన్ తీగలు వేసి పాత స్తంభాలను తొలగించడానికి రెండు నెలల వ్యవధి సైతం సరిపోవడం లేదా అని సర్వత్రా విమర్శలు వినవస్తున్నాయి.

అధికారులదా లేక కాంట్రాక్టర్ నిర్లక్ష్యమా

రెండు నెలలు పూర్తి అయినా ఇంకా విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ, విద్యుత్ లైన్లు సరిచేయడం కాకపోవడంతో పాటు మరో 3 నుంచి నాలుగు రోజులు పని ఉందని కింది స్థాయి విద్యుత్ సిబ్బంది చెబుతుండడంతో పట్టణ వాసులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పాటు అధికారులు సైతం ఆ కాంట్రాక్టర్‌కు వంత పాడే విధంగా ఉందని పలువురు విమర్శిస్తున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ లైన్

వర్ధన్నపేట పట్టణంలోని ఉషారాణి ఆస్పత్రి లైన్‌లో విద్యుత్ తీగలు ఇళ్లపై చేతులకు అందేవిధంగా ప్రమాదకరంగా ఉందని కాలనీ వాసులు భయపడుతున్నారు. ఇదే కాలనీలో కొందరు రాజకీయ పలుకుబడి, అధికార బలం, ప్రజా ప్రతినిధులకు మాత్రం వారి ఇళ్ల వద్ద ప్రమాదకరంగా ఉంటే ఆఘమేఘాలపై తొలగించి ప్రమాదం లేకుండా చేశారని తెలిపారు. ఇటీవల ఓ ప్రజా ప్రతినిధి వద్ద ఏఈ, డీఈ, ఈఈ ఉన్నతాధికారులు వచ్చి జీ హుజూర్ అంటూ ఆ లైన్లను తొలగించారని తమను పట్టించుకోవడం లేదని గోడు వెళ్లబోసుకున్నారు.

ఇబ్బందులు తీర్చాలి



పట్టణాభివృద్ధి పేరుతో తరుచూ విద్యుత్ అంతరాయం కల్పించి కేవలం కిలోమీటర్ దూరం విద్యుత్ లైన్‌ను రెండు నెలలుగా సాగదీయడం సిగ్గుచేటు. ఇందులో ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యంతో పాటు అధికారులు సైతం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా త్వరగా పనులు పూర్తి చేసి పట్టణ వాసుల ఇబ్బందులను తీర్చాలి.

\- అనిమిరెడ్డి కృష్ణారెడ్డి, వర్ధన్నపేట

ప్రమాదకరంగా విద్యుత్ లైన్



తమ కాలనీలో ప్రమాదకరంగా ఇళ్లపై నుంచి విద్యుత్ లైన్ వెళ్తోంది. ఎన్నిసార్లు విద్యుత్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. అధికారం, రాజకీయ బలం ఉన్నవారికి మాత్రం లైన్ తొలగించారు. పేదలం.. ఏ అండ లేని తమ ఇళ్లపై మాత్రం ఉన్న లైన్‌ను తొలగించడం లేదు. ఇంత అన్యాయమా..ఏదైనా ప్రమాదం జరిగితే ప్రజాప్రతినిధులు బాధ్యత వహించాలి.

-గడ్డం యాదగిరి, వర్ధన్నపేట

గ్రామాల అభివృద్ధికి కృషి



ఎమ్మెల్యే రమేష్‌కు పూలబొకే అందించి కృతజ్ఞతలు తెలుపుతున్న దుబ్బతండా వాసులు

పర్వతగిరి : వర్ధన్నపేట నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి పాటుపడతానని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. ఈ మేరకు హనుమకొండలోని ఎమ్మెల్యే నివాసంలో గురువారం జమాల్‌పురం నుంచి వడ్లకొండ వరకు వెళ్లే రోడ్డుకు మంజూరైన రూ.2కోట్ల 40లక్షల ప్రొసీడింగ్ కాపీని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పిడుగు రేణుకసాయిలు, బల్లే మల్లేషం, కారింగుల అరవింద్, బండి దేవేందర్, వెంకన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

అరూరిని కలిసిన దుబ్బతండా వాసులు

వర్ధన్నపేట : వర్ధన్నపేట మున్సిపల్ ఐదోవార్డు పరిధిలోని దుబ్బతండా వాసులు గురువారం వరంగల్ హంటర్ రోడ్డులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు తండాలో నెలకొన్న సమస్యలపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయన వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వారి సమక్షంలోనే పనులు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే రమేష్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్యాంసుందర్ రెడ్డి, తుమ్మల యాకయ్య, ఆంగోత్ భిక్షపతి పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థికసాయం

వర్ధన్నపేట మున్సిపల్ పరిధిలోని డీసీ తండాకు చెందిన ఆంగోత్ వసంత్‌కుమార్ కూతురు అంజలి అలహాబాద్‌లోని నిట్‌లో సీటు సాధించింది. కాగా నిరుపేద కుటుంబం కావడంతో ఈ విషయాన్ని ఎమ్మెల్యే అరూరి రమేష్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి గురువారం అరూరి గట్టుమల్లు ఫౌండేషన్ ద్వారా రూ.31 వేలు ఫీజు నిమిత్తం అందజేశారు. ఈ సాయాన్ని స్వయంగా విద్యార్థి ఇంటికి వెళ్లి అరూరి రమేష్ స్వయంగా అందించారు.

కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం



వర్ధన్నపేట: నీలగిరిస్వామి తండా తీజ్ వేడుకల్లో పాల్గొన్న కేఆర్.నాగరాజు, గిరిజనులు



చెన్నారావుపేట: తీజ్ బుట్టలతో మాధవరెడ్డి

- మాజీ ఐపీఎస్ అధికారి నాగరాజు

వర్ధన్నపేట : కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం రానుందని, బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజలు విసుగెత్తి పోయారని మాజీ ఐపీఎస్ అధికారి, కాంగ్రెస్ పార్టీ నేత కేఆర్.నాగరాజు అన్నారు. గురువారం డీసీ తండా పరిధిలోని నీలగిరి స్వామి తండా, గుబ్బేట తండా, దుబ్బతండా తదితర తండాలను కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు, మాజీ జెడ్పీటీసీ కమ్మగోని ప్రభాకర్‌తో కలిసి నాగరాజు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ రెండు పర్యాయాలు తెలంగాణ సెంటిమెంట్‌ను అడ్డుపెట్టుకుని అధికారంలోకి వచ్చి ప్రజాధనాన్ని కొల్లగొట్టిందని ఆరోపించారు. ఎన్నికలు రాగానే తాయిలాలు చూపిస్తూ ప్రజలను మభ్యపెడుతోందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ కనుమరుగు కావడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. నీలగిరి స్వామి తండాలో గిరిజనులతో కలిసి తీజ్ వేడుకల్లో పాల్గొన్నారు. దుబ్బతండాలో మృతిచెందిన భూక్యా శ్రీను కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. నాయకులు ఎద్దు సత్యనారాయణ, చోటు, అనిమిరెడ్డి కృష్ణారెడ్డి, మంగ్య, మల్లెపాక సమ్మయ్య, జేత్యా, మోహన్ నాయక్, కల్పన, కొండేటి బాలకృష్ణ, కుమారస్వామి పాల్గొన్నారు.

గిరిజనుల సంస్కృతికి ప్రతీక తీజ్

చెన్నారావుపేట : తీజ్ పండుగ గిరిజనుల సంస్కృతికి ప్రతీక అని ఏఐసీసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఈ మేరకు మండలంలోని అక్కల్‌చెడ గ్రామంలో గురువారం తీజ్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. గిరిజన ఆరాధ్య దేవతలు సేవాలాల్ మహరాజ్, మేరామా యాడికి పూజలు నిర్వహించారు. అనంతరం గోధుమ నారు బుట్టలను యువతులకు అందించారు. కాంగ్రెస్ నాయకులు, సర్పంచ్‌లు, యువజన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అవినీతి భూతాన్ని తరిమికొట్టాలి

- మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాశ్‌రెడ్డి

నర్సంపేట : అధికారం, అవినీతి భూతాన్ని తరిమికొట్టాలంటే అందరూ సమష్టిగా సంఘటితం కావాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 27వ తేదీన ఖమ్మంలో బీజేపీ భారీ బహిరంగ సభకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా విచ్చేస్తున్నందున నర్సంపేట నియోజకవర్గ వ్యాప్తంగా బీజేపీ నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. ప్రతి బూత్ నుంచి ఖమ్మం సభకు వెళ్లాల్సిందిగా కార్యకర్తలను కోరారు. బీఆర్ఎస్ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజాపక్షం వహించాలని విజ్ఞప్తి చేశారు. ఏ ఒక్క హామీ నెరవేర్చని కేసీఆర్ పాలన అవసరమా అని ప్రశ్నించారు. నిజమైన ప్రజాసంక్షేమం బీజేపీ ప్రభుత్వంతోనే సాధ్యమని, మాయల మరాఠీ కేసీఆర్‌ను ఇంటికి సాగనంపడమే ధ్యేయంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్లమెంట్ కో కన్వీనర్ జాటోత్ సంతోష్‌నాయక్, నియోజకవర్గ కన్వీనర్ వడ్డేపల్లి నర్సింహరాములు, కంభంపాటి ప్రతాప్, రేసు శ్రీనివాస్, బాల్నె జగన్, చిలువేరు రజనిభారతి, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారెడ్డి దీక్షకు రేవూరి సంఘీభావం

చెన్నారావుపేట : దళితులను, బీసీలను బీఆర్ఎస్ ప్రభుత్వం దగా చేస్తోందని మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జల్లీ గ్రామానికి చెందిన తొగరు చెన్నారెడ్డి ఆధ్వర్యంలో దళిత బంధు, బీసీ రుణాల ఎంపికలో జరిగిన అవకతవకలపై చర్యలు తీసుకోవాలని చేపట్టిన దీక్షకు గురువారం ప్రకాశ్‌రెడ్డి సంఘీభావం తెలిపి మాట్లాడారు. అవినీతి సర్కార్‌ను తరిమికొట్టడానికి దీక్షలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కొత్త స్కీంలతో ప్రజలను మరోమారు మోసం చేయడానికి ప్రజల ముందుకు వస్తున్నాడని ఆరోపించారు. దళిత బంధు, బీసీ కుల వృత్తుల రుణాలు అంటూ గ్రామాలోని ప్రజలను మభ్యపెడుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు వసూళ్లకు పాల్పడ్డారని విమర్శించారు. కలెక్టర్ స్పందించి పూర్తి స్థాయిలో విచారించి అసలైన నిరుపేదలకు లబ్ధి చేకూర్చాలన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో నర్సంపేట నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో బీసీ రుణాలు, దళిత బంధుపై దీక్ష కార్యక్రమంను నిర్వహిస్తామన్నారు.నాయకులు వడ్డెపల్లి నర్సింహరాములు, పోతరాజు రాజు, లక్ష్మీనర్సయ్య, చింతకింది వంశీకృష్ణ, తదితరులు ఉన్నారు.

కమిషనర్ మున్సిపల్‌కా.. మెప్మా శాఖకా?



నర్సంపేట : నర్సంపేట మున్సిపాలిటీ కమిషనర్ మున్సిపల్‌కా, మెప్మా శాఖకా అని సీపీఎం పట్టణ కార్యదర్శి హన్మకొండ శ్రీధర్ అధికారులను ప్రశ్నించారు. ఈ మేరకు పట్టణంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ.. నర్సంపేట మున్సిపల్ కమిషనర్ మున్సిపాలిటీ అడ్మినిస్ట్రేషన్ మరిచి మెప్మాపై అజమాయిషీ చేస్తూ ఆర్‌పీలను ఓటీపీల పేరుతో మున్సిపాలిటీకి సంబంధం లేని ప్రజల దగ్గరకు(బస్టాండ్లు, ఆటో అడ్డాలు) విద్యార్థుల దగ్గరకు వెళ్లి ఓటీపీలు తేవాలని ఆదేశాలు జారీ చేయడం ఏంటని ప్రశ్నించారు. మున్సిపల్ పట్టణంలో అనేక వార్డులలో చెత్తాచెదారం పేరుకుపోయి, రోడ్లన్నీ ధ్వంసమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే వాటి మీద దృష్టి పెట్టకుండా వీరిపై పెత్తనం చెలాయించడం ఏంటన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అనంతగిరి రవి, పట్టణ కమిటీ సభ్యుడు గడ్డమీది బాలకృష్ణ, కందికొండ రాజు, కలకోట అనిల్, కొండి మల్లయ్య, నాగరాజు, ఐటిపాముల వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న లైన్ ఇన్‌స్పెక్టర్ మృతి

- అవయవదానం చేసిన కుటుంబ సభ్యులు



ప్రభాకర్ (ఫైల్)

సంగెం : కాపులకనిపర్తి సెక్షన్‌లోని గవిచర్ల లైన్‌ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆకుతోట ప్రభాకర్ (52) హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈనెల 12న విధులు ముగించుకుని సాయంత్రం హనుమకొండ గోపాల్‌పూర్‌లోని నివాసానికి బైక్‌పై వెళ్తున్న క్రమంలో ఉర్సుగుట్ట సర్కిల్ వద్ద డీసీఎం ఢీకొట్టి ప్రమాదానికి గురయ్యాడు. వెంటనే ఎంజీఎం, తర్వాత హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్య సరోజన, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. ప్రభాకర్ కళ్లు, కిడ్నీలు, లివర్ తదితర అవయవాలను కుటుంబసభ్యులు దానం చేశారు. కాగా, ప్రభాకర్ మృతదేహాన్ని ఆపరేషన్ ఎస్ఈ మధుసూదన్, వరంగల్ డీఈలు భిక్షపతి, మల్లికార్జున్, కాపులకనిపర్తి ఏడీఈ నరసింహారావు, ఏఈ తిరుపతిరెడ్డి, విద్యుత్ సిబ్బంది సందర్శించి నివాళులర్పించారు.

సంక్షిప్త సమాచారం

బీఆర్ఎస్‌ది ఓటు బ్యాంకు రాజకీయం

నెక్కొండ : రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ ఓటు బ్యాంక్ రాజకీయాలు చేస్తోందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్ అన్నారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలో గురువారం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గడప గడపకు కాంగ్రెస్ ప్రచారం నిర్వహించారు.

సన్నాహక సభను విజయవంతం చేయాలి

నర్సంపేట : హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని జలవిహార్‌లో ఈనెల 27న తలపెట్టిన మున్నూరు కాపు సన్నాహక సభను విజయవంతం చేయాలని మున్నూరుకాపు నియోజకవర్గ కో ఆర్డినేటర్ నాగిశెట్టి ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు దామెరశెట్టి ఉత్తరయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణంలోని మున్నూరు కాపు సంఘం కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు.

యాదవ యుద్ధభేరికి తరలి రావాలి

హైదరాబాద్ నాగోల్‌లో నేడు(శుక్రవారం) తలపెట్టిన యాదవ యుద్ధభేరి సభకు గొల్ల కురుమలు అధిక సంఖ్యలో తరలి రావాలని గొల్ల కురుమ యూత్ రాష్ట్ర అధ్యక్షుడు ఆబోతు రాజుయాదవ్ పిలుపునిచ్చారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

పర్వతగిరి : తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కందికట్ల అనిల్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

నర్సంపేట / నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలం రాజుపేట గ్రామ పంచాయతీ గార్లగడ్డ తండాకు చెందిన పలువురు యువకులు గురువారం మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన యువకులకు కాంగ్రెస్ కండువాలు కప్పి ఆహ్వానించారు. బానోత్ లక్ష్మణ్ నాయక్, పాలాయి శ్రీనివాస్, పురుషోత్తం సురేష్, మండ రమేష్, తండ శ్రీధర్ పాల్గొన్నారు.

పాముకాటుతో మహిళ మృతి

రాయపర్తి : మండలంలోని జగన్నాథపల్లి గ్రామం కాశివాడకు చెందిన గోరీబీ(40) అదే గ్రామానికి చెందిన ఓ రైతుపొలంలో గురువారం కూలికి వెళ్లింది. ఈ క్రమంలో గట్టుపై ఉన్న పాము ఒక్కసారిగా గోరీబీ కాలుపై కాటు వేసింది. చికిత్స నిమిత్తం వర్ధన్నపేట ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

వీధి కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు



రాయపర్తి : వీధి కుక్కల దాడిలో రెండేళ్ల చిన్నారికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని తిర్మలాయపల్లిలో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన వేణు, ప్రవళిక దంపతుల రెండేళ్ల చిన్నారి దీక్షిత తన ఇంటి ముందు ఆడుకుంటుంది. ఈ క్రమంలో వీధి కుక్కలు ఆ చిన్నారిపై దాడి చేయడంతో అరుపులతో ఏడ్వసాగింది. అరుపులు విన్న తల్లి ప్రవళిక బయటకు వచ్చేసింది. చిన్నారి చుట్టుముట్టిన వీధికుక్కలు గాయపర్చుతున్న దృశ్యాలను చూసిన తల్లి కుక్కలను తరిమికొట్టి తన బిడ్డను కాపాడుకుంది. తీవ్రగాయాలైన చిన్నారిని చికిత్స నిమిత్తం వర్ధన్నపేట పట్టణ ఆస్పత్రికి తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

ముందస్తు అరెస్టు సరికాదు

గీసుకొండ : పరకాల పట్టణ బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో మండలంలోని బీజేపీ నాయకులను గీసుకొండ పోలీసులు గురువారం అరెస్టు చేయడం సరికాదని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రాదారపు శివకుమార్ అన్నారు.

ఇద్దరిపై కేసు



రాయపర్తి : మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన మూడు మహేందర్ గుడుంబాను తయారు చేసి అదే గ్రామానికి చెందిన మంద సాయిలుకు విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎం. స్వరూప పేర్కొన్నారు. ఈ సందర్భంగా గుడుంబా రవాణా చేస్తున్న పల్సర్‌బైక్ తోపాటు 8 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కానిస్టేబుల్ టి.వెంకటేష్, పి.రమేష్‌బాబు, డ్రైవర్ శేఖర్‌ను అభినందించినట్లు చెప్పారు.

చంద్రయాన్-3 సక్సెస్‌పై హర్షం



చెన్నారావుపేట: చంద్రయాన్-3 నమూనాతో ఉప్పరపల్లి హైస్కూల్ విద్యార్థులు



నర్సంపేట: ఇస్రో ఆకృతిలో కూర్చున్న విద్యార్థులు



నర్సంపేట రూరల్: బిట్స్ కళాశాలలో..



చెన్నారావుపేట: ఐకేపీ కార్యాలయంలో..

చెన్నారావుపేట : చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావడంతో ఉప్పరపల్లి హైస్కూల్ విద్యార్థులు గురువారం చంద్రయాన్-3 ప్రయోగ నమూనాను తయారు చేసి విజయోత్సవ వేడుకలను నిర్వహించారు. అలాగే కస్తూర్బా విద్యార్థులు మండల సమాఖ్య కార్యాలయంలో చంద్రయాన్-3 విజయోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. ఉప్పరపల్లి హైస్కూల్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం జన్నపురెడ్డి ఉమారాణి, భౌతిక, రసాయన శాస్త్రం ఉపాధ్యాయులు పిన్నింటి బాలాజీరావు, సీహెచ్ మాధవి, మద్దెల సరస్వతి, షాహేద, ఏపీఎం ఈశ్వర్, ఐకేపీ సిబ్బంది, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇస్రో ఆకారంలో విద్యార్థులు

నర్సంపేట : చంద్రయాన్-3 విజయోత్సవ సందర్భంగా నర్సంపేట పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు భారత ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు గురువారం ఇస్రో ఆకారంలో కూర్చున్నారు. ప్రధానోపాధ్యాయురాలు వసుమతి, సురేష్, శ్రీనివాస్, భిక్షపతి, బుచ్చిరాములు, తదితరులు పాల్గొన్నారు.

బిట్స్ కళాశాలలో..

నర్సంపేట రూరల్ : చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతమైనందుకు నర్సంపేట మండలంలోని లక్నెపల్లి గ్రామ శివారులోని బాలాజీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. జాతీయ జెండాలతో జేజేలు పలికారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హరిహరన్, ఏఓ సురేష్, అకాడమిక్ కోఆర్డినేటర్ నారాయణ, స్టూడెంట్స్ నిర్వాహక డీన్ ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య విద్యార్థుల సంబురాలు



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

వరంగల్ : చంద్రయాన్ -3 విజయవంతం కావడంతో వరంగల్ ఎల్‌బీనగర్‌లోని శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు సంబురాలు జరుపుకున్నారు. విద్యార్థులు ఇస్రో ఆకారంలో నిల్చున్నారు. అనంతరం నగరంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ బండారి కిరణ్‌కుమార్, పాఠశాల అకడమిక్ కోఆర్డినేటర్ మహేష్, డీన్ రంజిత్, సీ బ్యాచ్ ఇన్‌చార్జ్ జనార్దన్, నాసా ఇన్‌చార్జ్‌లు విద్యాసాగర్, రజనీకాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కౌశిక్‌చంద్రకు ఎంబీబీఎస్ సీటు



నల్లబెల్లి : మండలంలోని శనిగరం గ్రామానికి చెందిన విద్యార్థి ఎంబీబీఎస్‌లో సీటు సాధించాడు. శనిగరం గ్రామానికి చెందిన బండా సంధ్య-నరేష్ దంపతులకు కుమార్తెలు దీప్తి, మేఘన, కుమారుడు కౌశిక్‌చంద్ర ఉన్నారు. నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో వీరి తల్లి మృతి చెందగా.. రెండేళ్ల క్రితం తండ్రి మృతి చెందాడు. కాగా, వారు తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారారు. తల్లిదండ్రుల ఆశయానికి అనుగుణంగా చదువుపై దృష్టి సారించారు. తమ్ముడు కౌశిక్ చంద్రను డాక్టర్ చేయాలనే సంకల్పంతో అక్కలు ప్రోత్సహించారు. ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన నీట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి నిర్మల్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఆయన ఎంబీబీఎస్ సీటు సాధించాడు. కాగా, ఎంబీబీఎస్ సీటు సాధించిన కౌశిక్‌చంద్రతోపాటు తమ్ముడిని ప్రోత్సహించిన దీప్తి, మేఘనను పలువురు అభినందించారు.